మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
రామాయంపేట మున్సిపాలిటీలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు దేదీప్యమానంగా కొనసాగుతున్నాయి. పట్టణంలో సుమారు 18 అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి అంగరంగ వైభవంగా నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. మండపాలలోనే కాకుండా పట్టణంలోని మహంకాళి దేవాలయం, చిత్తారమ్మ దేవాలయం, దుర్గమ్మ దేవాలయం, రైతుబజార్ ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి నిత్యం ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. చిత్తారమ్మ దేవాలయంలో అమ్మవారికి నిత్యం సామూహిక కుంకుమార్చనలతో పాటు ప్రతిరోజు ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు స్థానిక రైతు బజార్ ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో మహాసేన యూత్, రైతుబజార్ ఎల్లమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి స్థానిక మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సరాపు యాదగిరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గజవాడ రాజు, ఎనిశెట్టి బాల్‌చందర్, టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న ఆదర్శ్‌రెడ్డి



**రామచంద్రాపురం, అక్టోబరు 6, ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భారతీ నగర్, రామచంద్రపురం డివిజన్‌లలో పూజలు అందుకుంటున్న దుర్గా భవాని మాతను బిఆర్ఎస్ రాష్ట్ర నేత ఆదర్శ్‌రెడ్డి, రామచంద్రాపురం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌లు బిఆర్ఎస్ నేతలతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంజీర నదికి వరద ఉధృతి

**ఇన్‌ఫ్లో 14168, అవుట్ ఫ్లో 19107 క్యూసెక్కులు**
**ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వలు**


సింగూరు ప్రాజెక్టు దృశ్యం

**పుల్కల్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టుకు నెల రోజులుగా వరద ప్రవాహం తగ్గడం లేదు. గత నెల సెప్టెంబరు 5వ తారీఖున ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టానికి చేరుకోవడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలిన విషయం పాఠకులకు విధితమే. నీటి నుంచి నేటి వరకు ఎత్తిన గేట్లు దించకుండా నిరాటంకంగా (నెల రోజులుగా) వరద నీటిని దిగువకు నీటి పారుదల శాఖ అధికారులు దిగువకు నీటిని వదుతూనే ఉన్నారు. నైరుతి రుతుపవనాలు నిష్క్రమించినప్పటికీ ప్రాజెక్టుకు ఎగువన మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎగువ నుంచి ప్రాజెక్టులోని నీటి ప్రవాహం కొనసాగుతోంది. రోజుకు 0.36 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. ఈ నెల రోజుల వ్యవధిలో తాజార ప్రాజెక్టులోకి శనివారం రాత్రి అందిన సమాచారం ప్రకారం... ఇన్‌ఫ్లో 14168 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 17107 క్యూసెక్కులుగా నమోదయింది. అధికారులు ఇప్పటికే ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం 6, 11 నంబరు క్రస్ట్ గేట్లను మీటరున్నర ఎత్తు ఎత్తి 16284 క్యూసెక్కులు. జోన్‌కోకు జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తికి 2 గేట్ల ద్వార 2823 క్యూసెక్కులువరద నీటిని దిగువకు వదులుతున్నారు. మొత్తం 19107 క్యూసెక్కులు అవుట్ ఫ్లో నమోదయింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29917 టీఎంసిలు కాగా అంతే స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. సింగూరు ప్రాజెక్టు దిగువన ఉన్న మంజీర రిజర్వాయర్‌లోకి వరద నీరు వస్తుండటంతో 8వ నంబరు క్రస్ట్ గేటు మీటరు ఎత్తి వచ్చిన వరద నీటిని వచ్చినట్లుగానే ఘనపూరం (వనదుర్గ) ప్రాజెక్టుకు వదులుతున్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో విస్తరించి ఉన్న మంజీర నది పరివాహక ప్రాంతాల్లోని చిన్నచిన్న ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు, చెరవులు, కుంటలు సమృద్ధిగా జలాలతో నిండాయి. అయా ప్రాంతాల్లో కొద్ది పాటి వర్షం కురిసినా రాత్రికి రాత్రే ప్రాజెక్టులోకి వరద నీటిరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి, ఇతర సిబ్బంది రేయిభవళ్ల ప్రాజెక్టు వద్దనే ఉంటూ వరద ప్రవాహాన్ని అంచనా వేస్తున్నారు. అప్రమత్తమై ఎప్పిటికి అప్పుడు వచ్చిన వదర ప్రవాహాన్ని దిగుకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు అమర్చిన 18 గేట్లకు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని గేట్లను మార్చుతూ వరద నీటిని వదులుతున్నారు. ఇక పోతే 7.5 ల విద్యుత్ సమార్థ్యం గల 2 టర్బయిన్లు నెలరోజులుగా నిరాటంకంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి.



## హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్ 41వ వార్డులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు అకర్షితులై అన్ని వర్గాల ప్రజలు పార్టీలో సభ్యత్వం తీసుకోవడానికి ఉత్సహంతో ముందుకు వస్తున్నారని తెలిపారు. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయడంలో సైతం ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీలను ఎప్పులు అమలు చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. సిద్దిపేట నియోజకవర్గం నిలిచిపోయిన అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాసంగారి వెంకన్న,తొడుపునూరి వెంకటేశం, ముద్దం రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎయిర్‌టెల్ వెంకట్, యాదవ్‌రావు, రాగారం శ్రీనివాస్, కనకరాజు,క్రిష్ణ, మల్లేశం, వినోద్,కొండల్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్ల వద్ద ఏర్పాట్లు చేయడంలో మున్సిపల్ చైర్మన్ విఫలం

**పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు**


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 6, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొందరూ అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు అలా వ్యవహరించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దన్నారు. అధికారుల పనితీరుతోనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని మంచి తేవాల్సి బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందన్నారు. కొంత మంది అధికారులు నేటికి బిఆర్ఎస్ అధికారంలో ఉన్నట్లే వ్యవహరిస్తున్నారని ఇది మంచి పద్దతి కాదన్నారు. పట్టణంలోని కోమటిచెరువుతో తదితర చెరువుల వద్ద బతుకమ్మ పండుగ సందర్బంగా ఏర్పాట్లు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువుల వద్ద ఏర్పాట్లు చేయడంలో మున్సిపల్ చైర్మన్ పూర్తిగా విఫలమైందన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ్, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్,దామోదర రాజనర్సింహల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునే చూస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు,గయాజొద్దీన్, రాశాద్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తా


సమావేశంలో మాట్లాడుతున్న వంగ రాజేశ్వర్‌రెడ్డి

**నంగునూర్, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
ముదిరాజ్‌లకు ఎల్లవేళాల తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ప్రముఖ వ్యాపారవేత్త, బిఆర్ఎస్ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నర్మెట గ్రామంలో ఆదివారం ముదిరాజ్ కులస్థుల ఆధ్వర్యంలో పున: నిర్మాణం చేయనున్న పెద్దమ్మ తల్లి దేవాలయానికి పూజ చేసి పనులు ప్రారంభించి మాట్లాడారు. ముదిరాజ్‌లు ఐక్యతతో ముందుకుసాగాలన్నారు. నేటి యువకులే రేపటి భావితరాలకు మార్గదర్శకులని..యువకులు ఉత్సహంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ హక్కుల సాధన సమితి యువత రాష్ట్ర అధ్యక్షులు అడిగే ప్రశాంత్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గట్టు బాలయ్య, సభ్యులు లక్ష్మయ్య, అప్పల శేఖర్ యాదవ్, రాములు,బాలయ్య, రాజు,శ్రీను, పర్శరాములు, గణేష్, రాజు,ఆలయ కమిటీ అధ్యక్షులు మిట్టపల్లి బాలరాజు, ఉపాధ్యక్షులు మహేష్, రాజు,నరేష్,స్వామి, భాను, స్వామి, కనకయ్య, బాబు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు, నాయకులు మాధవరెడ్డి, దశమంతారెడ్డి, వెంకటేష్, నరోత్తంరెడ్డి, అనంతరాజయ్య, పరమేశ్వర్,నరసింహరెడ్డి, సాయిరెడ్డి, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులకు సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేయడం జరిగింది. ఆదివారం గ్రామానికి చెందిన బొడపట్ల పోచవ్వకు రూ.42వేల చెక్కును అందించినట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పిఎసిఎస్ డైరెక్టర్ మామిడి సిద్దరాములు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యాసాగర్, మరియు నందు మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్ గడ్డం సురేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిడి సతీష్, తాడ్వాయి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళిత మహిళ సజీవదహనం కేసులో.. ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్**


సజీవదహనానికి బలైన ముత్తవ్వ కుటుంబాన్ని కలసి వివరాలు తెలుసుకుంటున్న డిబిఎఫ్ నాయకులు

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
మంత్రాలు, చేతబడి చేస్తున్నదనే నెపంతో దళిత మహిళ ద్యాగల ముత్తవ్వ సజీవ దహనానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నాడు డిబిఎఫ్ బృందం రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చేరుకొని ముత్తవ్వ కుటుంబాన్ని కలిసి, సంఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రాలు, చేతబడులు అని అంటున్న మూఢనమ్మకాలను పాటించవద్దని దళితులకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకెళ్తుతునన సమాజంలో అదే స్థాయిలో దేవుడు, దయ్యం, మంత్రాలు మూఢనమ్మకాలను పాలకులు, ప్రభుత్వాలు పెంచి పోషిస్తుండడం వల్లనే మూఢనమ్మకాలకు దళిత, బహుజనులు బలవుతున్నారన్నారు. మూఢనమ్మకాలు పాటించవదనదని ప్రజలకు అవగాహన కల్పించడంలో పాలకులు, ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. మూఢనమ్మకాలపై ప్రజలలో సాంస్కృతిక, కళాకారులతో చైతన్యం కల్పించాలన్నారు. మూఢనమ్మకాలు పాటించవద్దని చాటిన భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాటలో నడువలన్నారు. 15 సంవత్సరాల క్రితం ఇదే కాట్రియాల గ్రామంలో మంత్రాల నెపంతో దాడి జరిగిందన్నారు. పాతకక్షలు, భూవివాదాలను పరిష్కరించుకోలేక మూఢనమ్మకాల పేరుతో ఆటవిక, అమానుష, అమానవీయ సంఘటనలకు, దాడులకు తెగబడుతున్నారన్నారు. మంత్రాలు, తంత్రాలు, చేతబడులు బూటకమన్నారు. మంత్రాలు, చేతబడుల పేరుతో హత్యలకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. తమపై కేసులు పెడుతారా జైలు నుండి వచ్చిన తర్వాత చంపేస్తామని నిందితులు బహిరంగంగానే బాధితులను బెదిరించినందున బెయిల్ ఇవ్వవద్దని కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలో తెలంగాణ ప్రభుత్వం మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేయాలని కోరారు. బాధితులకు రక్షణ కల్పించి నష్టపరిహారం చెల్లించి, పునారావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాషి సంజీవ్, జిల్లా కార్యదర్శి హన్మకొండ దయాసాగర్, ధ్యాగల స్వామి తదితరులు పాల్గొన్నారుల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

## హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

**ఎమ్మెల్యే సునీతారెడ్డి**

**నర్సాపూర్ అక్టోబర్ 6. ప్రభాతవార్త:**
ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంతెలంగాణా సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేదన్నారు. అంతేగాక మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేసిందన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు చీరెలు ఇస్తామని ప్రకటించి ఇంతవరకు ఊసెత్తలేదన్నారు. మహిళలకు 5 వందల రూపాయిలు ఇస్తామని ప్రకటించి నేటి కి వారి ఖాతాలో డబ్బులు జమ చేయలేదని ఆమె విమర్శించారు.కనీసం బతుకమ్మ అడుకుందామంటే ఏర్పాట్లు కూడ చేయలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. కల్యాణ లక్ష్మి ,షాదీముబారక్ చెక్కులు లబ్దిదారులకు మంజూరై వచ్చి 8 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఇవ్వడంలేదన్నారు. మూడు సార్లు వ్యాలీడిటి కూడ అయిపోయిందని పేర్కొంటు ఈ విషయంలో ఆర్డీవోగాని, జిల్లా కలెక్టర్‌గాని స్పందించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంఇచ్చిన హామీలు నేరవేర్చ లేనందున త్వరలో లబ్దిదారులతో ఆర్డీవో కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడించి దర్నాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మున్సిఫల్ వైస్‌చైర్మన్ నహిమొద్దీన్,మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్,రింగుల ప్రసాద్, షేక్ హుస్సేన్, ఇంద్రసేనరెడ్డి, జగన్, స్వామి, మహ్మద్, సలీం ,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వైన్స్ షాప్‌లో చోరీ జరిగినందున వైన్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు తదితరులు

## నర్సాపూర్ లో వైన్స్ షాప్‌లో చోరీ

**నర్సాపూర్ అక్టోబర్ 6. ప్రభాతవార్త:**
వైన్ షాప్ లో చోరీ జరిగిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది,. ఈసంఘటన వివరాలు ఎస్ఐ లింగం కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి....నర్సాపూర్ పట్టణంలోగల బృందావన్ వైన్స్ షాప్ లో శుక్రవారం అర్ధ రాత్రి ఎవరో గుర్తు తెలియని దొంగలు షాష్ వెనకాల నుండి గోడకు రంధ్రం చేసి అందులోకి చోరబడి వైన్స్ షాప్‌లో నున్న వస్తువులను చిందరవందరంగా పడవేశారని తెలిపారు.అంతేగాక వైన్స్‌లోని క్యాష్‌కౌంటర్‌లో పెట్టిన నగదు 10 వేల రూపాయిలను ఎత్తుకెళ్లారని తెలిపారు. అంతేగార ఈ షాప్‌లోనున్న సీసి కెమెరాల యొక్క డివిఆర్ బాక్కులు కూడ ఎత్తుకెళ్లారని తెలిపారు. కాగా వీటి విలువ సుమారు 12 వేల వరకు ఉంటుందన్నారు.ఈ వైన్స్‌లో క్యాషియర్‌గా 5 సంవత్సరాల నుండి పని చేస్తున్న నారాయణరావు ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి 10 గంటలకు వైన్స్ షాప్ మూసివేసి పోయాడని అన్నారు. తిరిగి శనివారం ఉదయం 10 గంటలకు వైన్స్ ఓపెన్ చేసి నూడగానే వస్తువులన్ని చిందర వందరగా పడిఉన్నాయని దీంతో ఎవరో దొంగలు పడ్డారని తెలుసుకొని క్యాష్ కౌంటర్‌లో చూడగానే క్యాష్ లేదని, డివిఆర్ బాక్స్‌లు లేవని గుర్తించి సమాచారం పోలీసులు అందజేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.ఈ వైన్స్‌లో పని చేస్తున్న క్యాసియర్ నారాయణరావు ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సై అనాలి : మాజీ మంత్రి చంద్రశేఖర్



**జహీరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సై అనడం ఆనందంగా ఉందని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని కోహీర్ మండల పరిధిలోని పీచర్యాగడి తండాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు గ్రామానికి చెందిన కే ప్రసాద్‌రెడ్డి స్వచ్ఛంధ సంస్థ సేవ తరఫున గ్రామంలో పనులు చేపట్టేందుకు ముందుకు రాగా పనుల ప్రారంభానికి మాజీ మంత్రి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హజరై భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పుట్టి పెరిగిన గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన ప్రసాద్‌రెడ్డి అభినందనీయులన్నారు. పీచర్యాగడి తండాకు రోడ్డు నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో వక్ఫ్ భూముల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రానికి ప్రహరి గోడను నిర్మిస్తామ అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామలింగారెడ్డి, మక్సుద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హర్షద్, యేసు, ప్రసాద్‌రెడ్డి, నాయకులు హుగ్గెల్లి రాములుయాదవ్, కందెం నర్సింలు, రాథోడ్ వినోద్ కుమార్, షౌకత్ అలీ, షాకీర్ అలీ, మోసిన్, శంషీర్ అలీ, ముర్జల్, ముజెమ్మిల్, సురేష్, లాజర్, షాంసన్, తండా నాయకులు మంగు, నర్సింగ్, విజేందర్, మేఘనాథ్, లస్కార్ నాయక్, రవి, రాథోడ్ సంజీవ్ కుమార్, ఐఎన్‌టియుసిఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

## బిజెపి సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**
ఉమ్మడి మెదక్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. తెలంగాణ అభివృద్ధికి సైతం కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందని వివరించారు. సభ్యత్వ నమోదుకు యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతునానరని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి లక్ష్మీనర్సయ్య, నారాయణఖేడ్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి రవిశంకర్, బీజేపీ నాయకులు పత్రి రామకృష్ణ, రజనీకాంత్, మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్, శ్రవణ్ కుమార్, సుభాష్, జాడు రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల మండల పరిధిలో..

**గుమ్మడిదల, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బీజేపీ మండల అధ్యక్షులు పలుగు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బీజేపీ మహా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ కౌన్సిల్ సభ్యులు గిద్దె రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కన్వీనర్ శ్రీనివాస్ గుప్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని వర్గాల ప్రజలు, యువకులు ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్నటువంటి పరిణామాలను అరికట్టాలంటే కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు నర్సంపల్లి రాజిరెడ్డి, చింతల యాదగిరి, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, భాస్కర్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సృజనలక్ష్మి, కిసాన్ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ రాఘవరెడ్డి, చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులు కావలి ఐలేష్, బూత్ అధ్యక్షులు సాయిరాంరెడ్డి, యాదగిరి, మురళి చారి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ భక్తుడిని.. తల్లి ఆశీస్సుల కోసం సేవ చేస్తా

**-ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షులు మన్నె సాయి చరణ్**

**కొల్చారం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**
దుర్గమ్మ భక్తుడిని.. తల్లి ఆశీస్సుల కోసం సేవ చేస్తానని ఎంఎస్ఆర్ యువసేన ఫౌండర్ మన్నె సాయి చరణ్ అన్నారు. ఆదివారం కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో విగ్రహ దాత, ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షులు మన్నె సాయి చరణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటాపూర్ గ్రామలో దుర్గామాతను రద్శించుకున్న సాయి చరన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పాజిపల్లిలో దుర్గామాత మండప నిర్వాహకులకు రూ.25 వేల నగదును సాయి చరణ్ అందజేశారు. ఈ సందర్బంగా నిర్వాహకులు గజినీ వెంకట్ గౌడ్, గడ్డమీది నర్సింలు, దుర్గా భవాని ఉత్సవ కమిటీ సభ్యులు సాయి చరణ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంఎస్ఆర్ యువసేన సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గా భవాని ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## దుర్గామాత అమ్మవారికి బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపు దృశ్యం

**కొల్చారం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**
శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో దుర్గామాత అమ్మవారికి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి దుర్గామాత అమ్మవారికి సమర్పించారు.

## వంజరి సంఘం ఆధ్వర్యంలో పలువురికి సన్మానం


సన్మానం చేస్తున్న వంజరి సంఘం సభ్యులు

**రామాయంపేట, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
రామాయంపేట వంజరి సంఘం భవనంలో ఆదివారం నూతనంగా నియమితులైన నిజాంపేట మండల విద్యాధికారి సాంగని యాదగిరితో పాటు పలువురిని సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు నవాత్ ప్రమోద్, రామాయంపేట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పటేరి రాములను సన్మానం చేశారు. వంజరి సంఘం పట్టణ అధ్యక్షులు నవాత్ చిన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుల సోదరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. పదోన్నతి పొందిన సభ్యులు మరింత ముందుకు రావాలని వారు ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో వంజరి సంఘం కోశాధికారి పిబీ. మనోహర్, నాయకులు సాంగని చింటూ, బస్వరాజ్, సుధాకర్, నవాత్ ప్రసాద్, నవాత్ కిరణ్, కాలేరు హరికిషన్, సరిదె రాజు, నవాత్ నవీన్, నవాత్ మహేష్, ఆముద నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రైల్ ప్రాజెక్ట్ కారిడార్లలో మార్పులు చేయాలి



భక్తులకు అన్నవితరణ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

## మైసమ్మ దేవాలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్స్ మైసమ్మ దేవాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపి విహెచ్



అమ్మవారిని దర్శించుకున్న విహెచ్, దిడ్డి రాంబాబు తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కాచిగూడ చెప్పల్ బజార్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారిని రాజ్యసభ మజీ సభ్యుడు డాక్టర్ వి.హనుమంతరావు, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబులు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో వినోద్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నియో స్కిన్ నూతన బ్రాంచ్ ప్రారంభం



నియో స్కిన్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** మాదాపూర్‌లో నియో స్కిన్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యుడు, పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల పాండురంగారావు, ప్యాక్ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సినీ ఆర్టిస్ట్ ఈటీవీ ప్రభాకర్, రాంనగర్ బన్నీ మూవీ టీం, క్లినిక్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్



బతుకమ్మ ఆడుతున్న శేషుకుమారి

**సంజీవరెడ్డి నగర్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** రాష్ట్రమంతా బతుకమ్మ ఉత్సవ పండుగలు కనులపండుగగా జరుగుతున్నాయి. అమీర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి స్వగృహంలో ఆదివారం బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. బిఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాళ్లు సాంప్రదాయంగా, అందంగా ముస్తాబు చూసిన చూడచక్కని బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఈ సందర్భంగా శేషుకుమారి మాట్లాడుతూ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూతురు నరసింహ, బసాలక్ష్మీ, నాగలక్ష్మీ, రాణికవర్, దుర్గేష్, గుప్తా, అరుణ, రాణిభాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న పండితులు

**సంజీవరెడ్డినగర్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పలు ఆలయాలను సందర్శించారు. ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతోపాటు ఆయన పుట్టినరోజు కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సనత్‌నగర్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించున్న అనంతరం లక్ష్మీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను అందజేశారు. పుట్టినరోజు సందర్భంగా పలువురు పలువురు శాలువాలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు సురేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, అశోక్ యాదవ్, రాజేష్ ముదిరాజ్, భూపాల్‌రెడ్డి, రాంనివాస్ బన్సాల్, షియూష్ గుప్తా, పుట్టాల శేఖర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అయం ఈవో మాచర్ల దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ నేతృత్వంలో జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరణల చేశారు. కాగా శనివారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంతో దర్శనమిస్తారు. కాగా ఉదయం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

**సరూర్‌నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**
హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేస్-2 కి సంబంధించిన కారిడార్ 4, కారిడార్ 9లో మార్పులు చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ని కోరారు. ఈ మేరకు ఆయన కిషన్‌రెడ్డిని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి ప్రకటించి విడుదల చేసిన రూట్ మ్యాప్‌లో మెట్రో రైల్ ఫేజ్-2 కి సంబంధించిన కొత్త కారిడార్లలో నాగోల్ నుండి ఎల్‌బినగర్, మంద మల్లమ్మ చౌరస్తా, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కిలో మీటర్లు, అదే విధంగా కారిడార్ 9 శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫోర్త్ సిటీ వరకు 40 కిలో మీటర్లు కలిసి మొత్తం 76 కిలో మీటర్ల పరిధి ఉందని వివరించారు. అయితే ఈ కారిడార్ల రూట్‌లో మారు ్పలు చేయడం వల్ల కేవలం 41 కిలో మీటర్ల పరిధిలోనే ప్రాజెక్ట్ పూర్తి చేయవచ్చని ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా నాగోల్ నుండి ఎల్‌బినగర్, మంద మల్లమ్మ చౌరస్తా, బాలాపూర్ చౌరస్తా, శివాజీచౌక్ మల్లాపూర్, సుల్తాన్‌పూర్ ఆర్‌సిఐ రోడ్డు మీదుగా శంషాబాద్ ఎయిర్ పోర్టు, మహేశ్వరం గేట్, కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మార్పు చేస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ఈ మేరకు మెట్రో కారిడార్ల రూట్‌లో మార్పులు చేయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ ఛైర్మన్ బరిగల హేమలత రాజుగౌడ్, మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కార్పొరేటర్లు పసునూరి బిక్షపతిచారి, కాంటేకర్ మధుమోహన్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

## ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి

**కంటోన్మెంట్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆదివారం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్యాంప్ కార్యాలయానికి పూల బొకే, లేఖను పంపారు. అదే విధంగా ట్విట్టర్‌లో పోస్టు చేశారు. శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే తలసాని కృతజ్ఞతలు తెలిపారు.

## కన్నుల పండువగా బతుకమ్మ సంబరాలు..



బతుకమ్మ సంబరాలకు హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

**సరూర్‌నగర్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మీర్‌పేట్ ఆర్యవైశ్య సంఘం సహకారంతో బతుకమ్మ పోటీలను నిర్వహించారు. మీర్‌పేట్‌లోని ఎస్‌బిఐ బ్యాంకు ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీలకు మహిళల నుండి మంచి స్పందన లభించింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం ఎంపిక చేసిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రతి బతుకమ్మకు ప్రోత్సాహ బహుమతులు ప్రకటించిన నిర్వాహకులు వాటిని మహిళలకు అందజేశారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళ్ళ శ్రీనివాస్ గుప్త అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, జిల్లెలగూడ కార్పొరేటర్ పోరెడ్డి పద్మ భాస్కర్‌రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారద, ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ, సామ్రాజ్య లక్ష్మి, చింతల రవికుమార్‌గుప్త, జిల్లా మహా సభ అధ్యక్షుడు వెంకటేశం గుప్త, బిలకంటి కిరణ్‌గుప్త, చీకటిమల్ల కవిత, దుద్దెల్ల రమాదేవి, మంచన ప్రేమ్‌కుమార్‌గుప్త, తోనుపునూరి శ్రీనివాస్ గుప్త, ఆకుల చంద్రప్రకాశ్‌గుప్త, వంగాల ఓంకారం గుప్త, కార్పొరేటర్ గజ్జల రాంచందర్ పాటు వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

## నవ్యనాటక సమితి సేవలు అభినందనీయం

తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు కె.వి.రమణాచారి



సుధామాల, హేమలను సత్కరిస్తున్న రమణాచారి, వసుంధర, విజయకుమార్ తదితరులు

**రవీంద్రభారతి, అక్టోబరు 6 ప్రభాతవార్త :** సాంస్కృతిక రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న నవ్యనాటకసమితి ఆరున్నర దశాబ్దాలుకుపైగా భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీత, నృత్యరీతులలో జాతీయస్థాయిలో పోటీలను నిర్వహిస్తూ యువకళాకారులను ప్రోత్సహించి ఫరిడవిల్లింపజేస్తున్న సాంస్కృతికరంగ కృషి అపూర్వం అనితర సాధ్యమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఆదివారం రెడ్‌హిల్స్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో నవ్యనాటకసమితి ఇటీవల నిర్వహించిన 49వ జాతీయస్థాయి సంగీత నృత్యపోటీల అభినందన సభ, సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించిన నృత్యగురువులు సుధామాల, ఇందిరాహేమలను అభినందించి ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయిలో యువకళాకారులకు వేదికను అందించి జాతీయ సమైక్యత, సమగ్రతకు తోడ్పడడం హర్షదాయకమంటూ యువకళాకారులు మనదేశ సాంస్కృతిక రాయబారులని అభివర్ణించారు. సంస్థ అధ్యక్షుడు వి.విజయకుమార్ సమావేశానికి స్వాగతం పలుకగా పాల్గొన్న నృత్యగురువులు ఉన్నత ప్రమాణాలతో, నిబద్ధతతో జరిగిన ఈ పోటీలు ప్రయోజనాలను అందిస్తాయన్నారు. సంస్థ కార్యదర్శి సుధామాల కార్యదర్శి నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఫణీంద్ర, విశ్వనాథ్, నారాయణరావు, రమాదేవి, సుధారాణి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు

**శేరిలింగంపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా బతుకమ్మ సంబరాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని శేరిలింగంపల్లి నియోజక వర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్, శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం లో ఘనంగా బతుకమ్మ సంబరాలను అంగరంగం వైభవంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని ఆయా డివిజన్లలోని మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలను తీసుకువచ్చి ఆట,పాటలతో సందడిచేశారు. తిరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఆడపడుచులు పండుగ చేసుకున్నారు.

ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణలో పూలను పూలతో పూజించే పండుగగా బతుకమ్మ సంబరాలను నిర్వహించుకోవడం అనవాయితీగా వస్తున్న సంస్కృతిగా ఆయన పేర్కొన్నారు.ప్రకృతిని ప్రేమి ంచే తత్వం తెలంగాణ మట్టిమనుషుల్లో ఉందన్నారు. తిరొక్కపూలతో బతుకమ్మలను సుందరంగా అలంకరించి ఆడపడుచులందరూ ఒక్కచోట చేరి ఆట,పాటలతో సంతోషంగా గడపటం,అమ్మవారిని పూజిస్తూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస నాయకులు, కార్యకర్తలతో పాటు శేరిలింగంపల్లి, చందానగర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో విచ్చేసి బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు.



బాలాపూర్ గణేష్ లడ్డూతో ఢిల్లీ చేరుకున్న శంకర్‌రెడ్డి

## బాలాపూర్ గణేష్ లడ్డూ ప్రధాని మోడీకి ఇచ్చేవరకు హైదరాబాద్‌కు తిరిగిరాను: శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** బాలాపూర్ గణేష్ లడ్డూను ప్రధాన నరేంద్ర మోడీకి ఇచ్చే వరకు హైదరాబాద్‌కు తిరిగి రానని లడ్డూ వేలం విజేత, తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ.31.01 లక్షలకు వేలంలో లడ్డూను పొందిన ఆయన అప్పట్లో ప్రకటించిన మేరకు లడ్డూను తీసుకొని ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, దేశ రక్షణ కోసం కృషిచేస్తున్న మోడీ జన్మదినం రోజు తీసుకున్న లడ్డూను ఆయనకే అందజేస్తానని వెల్లడించారు. దేశాభివృద్ధి కోసం పాటుపడుతున్న మోడీకి శక్తి సామర్థ్యాలను ఇవ్వాలని కోరుతూ తీసుకున్న లడ్డూను ఆయనకు ఇచ్చేంత వరకు ఢిల్లీలోనే ఉంటానని శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## కవులు, రచయితలకు ప్రోత్సాహం అవసరం

-టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ జనార్ధన్

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సాహిత్యాన్ని భావితరాలకు అందించే కార్యక్రమం నిరంతరాయంగా జరగాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టిడి.జనార్ధన్ అన్నారు. ఆదివారం రాత్రి బాగ్‌లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వార్షికోత్సవ సభ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్ అధ్యక్షతన జరిగింది. ఫౌండేషన్ కార్యదర్శి, కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ సమన్వయంలో జరిగిన ఈ సభలో బిక్కి కృష్ణ రచించిన తెలుగు గజళ్ళు 'శిల్పసౌందర్యం', డాక్టర్ విజయలక్ష్మి పండిట్ రచించిన 'హృదయాంజలి', 'గజల్ షాయరీ' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాలను ఆవిష్కరించిన అనంతరం టిడి.జనార్ధన్ మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సాహితీప్రియుల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న వ్యక్తి బిక్కి కృష్ణ అని అన్నారు. ప్రభుత్వాలు గుర్తించి ప్రోత్సహిస్తే ఎంతో గొప్ప అనుభూతిని కలిగిస్తుందన్నారు. ఉత్సాహం, ప్రోత్సాహం చాలా అవసరమన్నారు. భవిష్యత్తు బిక్కికృష్ణ ఎపి ప్రభుత్వం అండగా ఉండే విధంగా తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ పూర్వ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, రచయిత భగీరథ, ప్రముఖరచయిత డాక్టర్ వీడీ.రాజగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, విమలసాహితీ సమితి అధినేత డాక్టర్ జల్ది విద్యాధరరావు, ప్రముఖ రచయిత డాక్టర్ బీరం సుందర్‌రావు, ఫౌండేషన్ సభ్యులు వూర శ్రీను, రాకేశ్, కుసుమ రాధా, ఎం.ఉషారాణి పాల్గొన్నారు.

## నాటక సమాజాల సమాఖ్య మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా గురకుంట మణిపాల్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర నాటక సమజాల మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా గురకుంట మణిపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం కూకట్‌పల్లిలోని భారత వికాస్ పరిషత్‌లో మేడ్చల్ జిల్లా కళాకారుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా ములుగు రామాచారి, ప్రధాన కార్యదర్శిగా కతారి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా సోమర ఎర్రిస్వామి చౌదరి, కోశాధికారిగా గోగినేని ఉమామహేశ్వరరావు, సభ్యులు జయరామ్, ఏ.వెంకటేష్, నాగరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కార్యదర్శి శామ అంజిరెడ్డి, నామ చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జూపార్కు 61వ వ్యవస్థాపక దినోత్సవం

**చార్మినార్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో ఆదివారం జూ పార్కు 61వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది.జూ పార్కు వ్యవస్థాపక దినోత్సవాన్ని సందర్భంగా ఉద్యోగులు,సిబ్బందికి పలు రకాల పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరామత్ పోటీలలో గెలు పొందిన ఉద్యోగులు,సిబ్బందికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.కాగా జూపార్కులో ఆర్‌ఓ వాటర్ యూనిట్ కోసం నగరంలోని బొల్లారం గ్లాండ్ ఫార్మాస్యూటికల్ మేనేజింగ్ ట్రస్టీ కెప్టెన్ రిటైర్డ్ రఘు రామన్ 25 లక్షల రూపాయల చెక్కును జూ పార్కు క్యూరేటర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరామత్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ బర్నోబా,పిఆర్‌ఓ మహ్మద్ హనీఫ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.జూపార్కులో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

## బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**సంజీవరెడ్డి నగర్, అక్టోబరు 6, ప్రభాతవార్త**

సనత్‌నగర్ నియోజకవర్గం అమీర్‌పేట్ గురు గోవింద్ సింగ్ ఎంసిహెచ్ గ్రౌండ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం దేవి నవరాత్రుల సందర్భంగా బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బల్కంపేట ఈఓ కృష్ణ, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, శ్యామ్ సుందర్‌గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ కుమార్, రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కిషన్‌రెడ్డి



మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

## శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో తలసాని పూజలు

**కంటోన్మెంట్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** నిత్యం ప్రజా సేవలో నిమగ్నం అవుతూ రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి ప్రధాన అర్చకులు రాజేశ్వరశర్మ ఆశీర్వచనం చేశారు. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మారేడ్‌పల్లిలోని శ్రీసుబ్రమణ్య స్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమలో ఆలయ మాజీ చైర్మన్ చిర్రబోయిన సంతోష్ యాదవ్, మోండా డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ, నాయకులు నాగులు, నార్ల దీపక్, హన్మంత్ రావ్ యాదవ్, గుజ నాగేందర్ యాదవ్, వేణు చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంగూడలో నవరాత్రి ఉత్సవాలు

**చార్మినార్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** పాతబస్తీ నందిముస్లాయిగూడలో అత్యంత వైభవంగా శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్నాయి. కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయికిరణ్ ఆదివారం నందిముస్లాయి గూడలోని శ్రీదుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయికిరణ్‌తో పాటు పలువురిని ఉత్సవాల నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతు న్నాయని తెలిపారు.బిఆర్ఎస్‌నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## రాగి వీరాచారి పాస్‌పోర్టును జప్తు చేయాలి

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:**

క్రైస్తవులకు దైవక్షేత్రమైన హెబ్రోన్ చర్చ్ ప్రతిష్టను దిగజార్చిన రాగి వీరాచారి దేశం విడిచిపారిపోకుండా పాస్‌పోర్టును వెంటనే జప్తు చేయాలని చర్చ్ ప్రతినిధులు ఏలియా జయరాజు, జేమ్స్(జిమ్మి), యు.జయప్రకాశ్, ఎంఎఫ్. క్రిష్టఫర్ వివరించారు. గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తనపై దాడి చేశాడని ఓ వ్యక్తిపై పోలీసులు కేసులు నమోదు చేశారని, అయితే తనను ఎక్కడ అరెస్టు చేస్తారోననే భయంతో వీరా చారి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారని, అయితే రాగివీరా చారిపై ఇప్పటికే 34 కేసులు నమోదు అయి ఉన్నాయని, బెయిల్ ఇవ్వొద్దని చేసిన విజ్ఞప్తి మేరకు హైకోర్టు బెయిల్‌ను నిరాకరించడం జరిగిందని, రెండవసారి అతని ప్రధాన అనుచరుడు బబ్బి అలియాస్ ఎం.ప్రదీప్‌కుమార్‌తో కలిసి బెయిల్ కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, రెండవసారి కూడా బెయిల్‌ను న్యాయస్థానం నిరాకరించిందని అన్నారు. ప్రస్తుతం గత కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు.

## దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడాకారులతో దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు బోడి బాలరాజ్

**మెహిదీపట్నం, అక్టోబరు 6, ప్రభాతవార్త :**

విజయదశమి వేడుకలను పురస్కరించుకొని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు బోగి బాలరాజ్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా యువకులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బోగి బాలరాజ్ మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా లంగర్‌హౌస్‌లో విజయదశమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయిన నాటి నుంచి లంగర్‌హౌస్‌లోని యువకులకు వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారంబోర్డ్ క్రీడలతో పాటు వివిధ రకాల క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలలో గెలుపొందిన యువకులకు విజయదశమి రోజు బహుమతులను ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందించడం జరుగు తుందని తెలిపారు. కార్యక్రమంలో దసరా ఉత్సవ సమితి జనరల్ సెక్రటరీ గౌతమ్ అనీల్‌కుమార్, ట్రెజరర్ పి.శ్రీనివాస్ యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కాత్యాయనిదేవి అలంకారంతో అమ్మవారు దర్శనం

**చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వీధిలో నేతాజి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారు ఆదివారం కాత్యాయనిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మబంధు, కల్యానందపీఠం పీఠాధ్యక్షులు బ్రహ్మశ్రీ ఆచార్య డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ వారి శిష్య బృందం నాగరాజుశర్మ, సాయినాథశర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఈవో కె.రామంజనేయులు, నగర తెలుగుదేశం ప్రార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, కందూరి కృష్ణ, వందన రాజగోపాల్, వికాస్‌చంద్‌జైన్, వలభ్ జైన్, సజ్జన్‌జైన్, పి.హరీష్‌గుప్త, ఉదయ్‌కుమార్ గుప్త, అనీల్‌కుమార్, శరత్‌గుప్త, డి.చంద్రమోహన్‌గౌడ్, పి.శివకృష్ణగౌడ్, టి.నగేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంట పాన్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆదివారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంతో దర్శనమిస్తారు.

## కట్టమైసమ్మ ఆలయంలో తలసాని పూజలు

**బేగంపేట అక్టోబరు 6,ప్రభాతవార్త :** దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు, తన పుట్టిన రోజు సందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం బేగంపేట లోని శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మీ అమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.పూజల అనంతరం ఆలయ ఈ ఓ వంగా అంబుజా,ఆలయ ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్‌లు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేసారు.అనంతరం వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసారు.అనంతరం ఆలయ సిబ్బంది తలసానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, ఆలయ ఈ ఓ వంగా అంబుజ,ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్,బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీహరి, డి.వి.నరేందర్‌రావునాయి, శేఖర్ ముదిరాజ్, ప్రవీణ్‌రెడ్డి, కొసికే కిషోర్, ఆరీఫ్, అఖిల్ తదితరులు ఉన్నారు.

## గ్లోబల్ హిందూ ఫెడరేషన్ మొబైల్ అప్లికేషన్ ఆవిర్భావం

**నాంపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త :** ప్రపంచవ్యాప్తంగా హిందూ సంస్థలను ఏకతాటిపైకి తీసుకురావడం కోసం గ్లోబల్ హిందూ ఫెడరేషన్ మొబైల్ అప్లికేషన్‌ను ఈరోజు అధికారికంగా ప్రారంభించడం ఒక మైలు రాయి అని గ్లోబల్ హిందూ ఫెడరేషన్ ఛైర్మన్ సి.డి. చవాన్ అన్నారు. ఈ అప్లికేషన్ లక్ష్యాలను వివరిస్తూ ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూసంస్థలను ఏకతాటిపైకి తీసుకురావడమేనని, సంఘంలో ఐక్యత, సహకారం పెంచేవిధంగా పనిచేస్తుందని ఆయన చెప్పారు. ప్రతీ హిందూ సంస్థ ఫెడరేషన్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.గ్లోబల్‌హిందూ ఫెడరేషన్. నెట్‌లో నమోదు చేసుకుని, కలసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన సుభాష్ అగర్వాల్, కమ్లేష్ మహారాజ్, బంగారయ్యశర్మ, యోగేష్‌ప్రభు, వీరధర్మజస్వామి, శ్యామ్‌సుందర్, కొత్తకొండ రాజు, జిగ్నేష్‌జోషి, నందికొండ రమేష్, గోవిందరాజు, గాయత్రి, దేవిక, పరమేశ్వరి, అనిల్ కటికర్, మదన్‌గుప్తాలు ఈ అప్లికేషన్ హిందూ సంస్థలను కలుపుతూ వాటిని బలపరిచే వేదిక ఎంత ముఖ్యమో గుర్తించి మన సంస్కృతి, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విశ్వవ్యాప్తంగా తీసుకెళ్లడానికి ఒక కీలక పరికరంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## ప్రతి పౌరుడు స్వచ్‌భారత్‌లో భాగస్వాములు కావాలి
### వికారాబాద్ నియోజకవర్గం బిజెపి కో ఆర్డినేటర్ వడ్ల నందు



**వికారాబాద్ రూరల్,అక్టోబరు 6, ప్రభాతవార్త**
దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపులో భాగంగా వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి ఆద్వర్యంలో ఆదివారం కొత్తగడి సమీపంలో బంగారు మైసమ్మ ఆలయం ఆవరణలో బిజెపినాయకులు స్వచ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించే భక్తులు వ్యర్థ పదార్థాలను అక్కడ ఏర్పాటుచేసిన చెత్తకుండీల వద్దనే వేయాలని ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాపార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి పట్టణ పార్టీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి మోహన్‌రెడ్డి లెక్చరర్ జిన్నారం మోహన్‌రెడ్డి విజయ కుమార్ మాజీ ఎంపిటిసి శరణరెడ్డి బిజెపి మండల ఉపాధ్యాక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘాన్సీమియా గూడలో వీధి కుక్కల స్వైరవిహారం
### చిన్నారిపై కుక్కల దాడి .. తీవ్రగాయాలు

**శంషాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త** శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఘాన్సీమియా గూడలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామం నడిబొ డ్డులో ఆడుకుంటున్న అక్షిత (4) చిన్నారిపై కుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన నీరటి రాజు కూతురు అక్షిత ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటనలో చిన్నారి అక్షిత తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వీధికుక్కలను నివారించాలని స్థానిక పంచాయతీ మాజీ సభ్యుడు దెపల్లె సుజాత మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. వీధి కుక్కల బెడద నివారించాలని అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు. వీధి కుక్కలు చిన్నారులపై దాడి చేసి ప్రాణాలు తీస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం లేదని అన్నారు. అధికారులు వెంటనే వీధి కుక్కలను బంధించి తగు చర్యలు తీసుకోని పక్షంలో హైకోర్టు లో పిటిషన్ వేస్తామని సుజాత మల్లేష్‌గౌడ్ హెచ్చరించారు.

## శ్రీనివాసులగూడెంలో పత్తిరైతుల క్షేత్రస్థాయి ప్రదర్శన



**నందిగామ, అక్టోబరు 6, ప్రభాతవార్త** నందిగామ మండలం శ్రీనివాసుల గూడ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం నాథ్ బయోజీన్స్ ఇండియా లిమిటెడ్ వారి నాథ్ సంకేత్ కాటన్ క్షేత్ర ప్రదర్శనను స్థానిక రైతు మహేందర్‌రెడ్డి పొలంలో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో శ్రీనివాసులు గూడెం చుట్టుపక్కల గ్రామాల రైతులు డీలర్లు కంపెనీ ప్రతినిధులు సుమారు 150 మంది రైతులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాథ్ సాకేత్ కాటన్‌పై ప్రతినిధి బృందం పలు సలహాలు సూచనలు రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు గూడ మాజీ సర్పంచ్ రైతు చంద్రారెడ్డి డీలర్స్ మహేందర్‌రెడ్డి అనిల్‌కుమార్ రెడ్డి పవన్ కంపెనీ ప్రతినిధులు బిశివకుమార్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పిఆర్‌సి ,డిఏ లు వెంటనే ప్రకటించాలి
### పిఆర్‌టియు టిఎస్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న పిఆర్‌టియు టిఎస్ నర్సాపూర్ మండల శాఖ అధ్యక్షులు బి.అక్కినారాయణ తదితరులు

**నర్సాపూర్ అక్టోబర్ 6. ప్రభాతవార్త:**
దసరా పండుగకు పిఆర్‌సి ఐదు డిఏ లు వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియు టిఎస్ నర్సాపూర్ మండల శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం నర్సాపూర్‌లో పిఆర్‌టియు టిఎస్ నర్సాపూర్ మండల శాఖ అధ్యక్షులు బి.అక్కినారాయణ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు గత రెండు సంవత్సరాల నుండి డిఏ ప్రకటించలేదన్నారు.నిత్యవసర వస్తుధరలకనుగుణంగా ఆరునెలలకొకసారి డిఏ ప్రకటించాల్సి ఉండగా గత ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన ఐదు డిఏ లు పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు.అదేవిదంగా పిఆర్‌సి కమీషన్ వేసి సుమారుగా సంవత్సరం గడుస్తున్నా ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి డిఏ లను వంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ప్రభుత్వ పాలనలో తమ వంతు పాత్రపోషిస్తుప్రభుత్వం యొక్క సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోయే గురుతర భాధ్యత ప్రభుత్వ ఉద్యోగులదేనన్నారు.అట్టి ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వసంక్షేమమని బావించి ఉద్యోగులకు దసరా పండుగ కానుకగా ఉద్యోగ ,ఉపాధ్యాయ,పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు, పిఆర్‌సి, డిఏ లను వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియు టిఎస్ నర్సాపూర్ మండల శాఖ డిమాండ్ చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ నర్సాపూర్ మండల శాఖ అధ్యక్షులు బి.అక్కినారాయణ తో పాటు అసోసియేట్ అధ్యక్షులు ఇంతియాజ్, ఎం భీమ్లా, శ్రీ జ్యోతి,రవి,సరిత, తదితరులు పాల్గొన్నారు.



కేతకి ఆలయంలో శరన్నవరాత్రి పూజలో భక్తులు

## బాల త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం

**ఝరాసంగం, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేత శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రపత్తులతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ఆర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఆలయంలో హోమాలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పూజల్లో జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, ఆలయ అర్చకులు, రికార్డు అసిస్టెంట్ వీరన్న, రమేష్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మను దర్శించుకున్న డిపో మేనేజర్



**మనూర్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువున్న నల్లపోచమ్మ ఆలయాన్ని నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మేనేజర్ మల్లేశంను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా మల్లేశం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**-లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం...**

ఆలయంలో కొనసాగుతున్న దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ఆలయ అర్చకులు సిద్ధస్వామి, నగేష్ స్వామి, ప్రవీణ్‌స్వామిలు బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో పిఆర్‌ఓ పాండు హర్షవర్ధన్, పిట్ల రవి, బోరంచ గ్రామానికి చెందిన కొంగరి మల్లారెడ్డి, శేఖర్, బాలకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొని డిపో మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు.

## బస్సుల్లోంచి పడ్డ యువకుడికి తీవ్ర గాయాలు

**చౌటకూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సులో ప్రయాణిస్తున్న యువకుడు రేబో బస్సు నుంచి జారి పడి తీవ్ర గాఆయలకు గురైన సంఘటన మండల పరిధిలోని శివంపేట గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. ప్రయాణీకుల కథనం ప్రకారం... ఒడిశ్యా రాష్ట్రానికి చెందిన రేబో (21) మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో డెస్ దాబా హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి వెళ్లి మెదక్ ఆర్టీసి డిపోకు చెందిన (టిఎస్ 35టీ 3443) బస్సులో తిరిగి వస్తున్న క్రమంలో ఆర్టీసి బస్సులో ఫూట్‌బోర్డుపై ప్రయాణం చేస్తుస్తూ శివంపేట గ్రామ శివారులోని శ్రీ వీరభద్ర రైస్ మిల్లు వద్ద ప్రమాదావశాస్తు బస్సులో నుంచి కింద జారి పడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. క్షతగాత్రుడు రేబోను సంగారెడ్డిలోని ఓ ప్రయివేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ ప్రాంగణంలో ఆదివారం బతుకమ్మ వేడుకలను విద్యార్థినులు ఘనంగా జరుపుకున్నారు. రంగు రంగు పూలతో అందంగా అలంకరించుకున్న బతుకమ్మలను ఒక చోట చేర్చుకుని బతుకమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కోలాటలు ఆడుతూ పాటలు పాడుతూ బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ ఎగ్జిక్యూటివ్ సభ్యులు డిడిఎంఎస్, పిఎంసి, ఎస్‌టివిసి చైర్మన్ పర్సన్‌బండరి రాణి, కో-ఆర్డినేటర్ కల్పన, ప్రిన్సిపల్ ఆయేషా సిద్ధిఖాలు పాల్గొని సంబరాల్లో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ సంగారెడ్డి శాఖ సిబ్బంది అషీలీ శ్రావణి, ఎస్తేరు రాణి, షబానా, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల పోస్టులకు ధరఖాస్తులు ఆహ్వానం

**సిర్గాపూర్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఎస్టీ బాలికల గురుకుల విద్యాలయంలో ఖాళీ పోస్టులకు తాత్కాలిక పద్ధతితో అధ్యాపకులు అవసరం అని, అర్హులైన వారు ధరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ హేమలత సూచించారు. కళాశాలలో జంతు శాస్త్రం-1, పీజీటి తెలుగు, మ్యాథ్స్, సైన్ పాఠాలు బోధించేందుకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హత కల్గిన మహిళా అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ వకు ఆర్‌డిఓ కార్యాలయంలో నిర్వహించే డెమో ఇంటర్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపల్ సూచించారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రికెట్ టోర్ని ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం మైదానంలో ఆదివారం పికెఆర్ ట్రస్ట్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణఖేడ్ ప్రీమియం లీగ్ (ఎన్‌పిఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డితో కలిసి క్రికెట్ ఆడుతూ టోర్నిని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ సేట్, నాయకులు రాజేష్, హనుమాండ్లు, వివేకానంద, సద్దాం, రామకృష్ణ, నర్సింలు, మాజిద్, జూలా నాయక్, నారాయణ జాదవ్, పండరి నాథ్, ఆరిఫ్, దీపక్‌రెడ్డి, సిద్ధరెడ్డి, ఆకాష్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, పవన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం స్లాబ్ నిర్మాణానికి భారీ విరాళం

**గుమ్మడిదల, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డి సంఘం భవనం స్లాబ్ నిర్మాణానికి సంబంధించిన రెడ్డి మిక్స్ మెటీరియల్‌కు గుమ్మడిదల గ్రామ తాజా మాజీ సర్పంచి చిమ్ముల నరసింహారెడ్డి కుమారులు సీజీఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ట్రస్టు వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డిలు 6 లక్షల రూపాయల చెక్కును రెడ్డి సంఘం అధ్యక్షులు జగ్గారెడ్డి, బాల్‌రెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రతి సంఘం ప్రాముఖ్యత వహిస్తుందని, రెడ్డి సంఘంతో పాటు గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాలకు, అన్ని సంఘాలకు తమకు తోచిన సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మండలంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతో తండ్రి నేర్పిన సేవ బాటలో నడుచుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిమ్ముల దేవేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, చంద్రా రెడ్డి, మల్లారెడ్డి, రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మహేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మల్లారెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి
### -వెంచర్ల యజమానులపై చర్యలు తీసుకోండి సిపిఐ నాయకులు డిమాండ్



**నాగల్‌గిద్ద, అక్టోబరు 6, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ జిల్లా కమిటి సభ్యులు చిరంజీవి గణపతి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూముల్లో హరితవనం ప్రైవేటు వెంచర్ల నిర్వాహకులు రోడ్డు వేసుకుని వ్యవసాయ భూములను గుంటల చొప్పున అక్రమ దారిలో రిజిస్ట్రేషన్ చేసుకుని దర్జాగా ప్రయాణం సాగిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో కొనసాగుతున్న అవినీతి అక్రమాలను అధికారులు దృష్టికి తీసుకుపోయిన ప్రయోజనం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపా రులకు ప్రభుత్వ ఆధికారులు వంత పాడుతున్నారని ఆరోపించారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి హరితవనం వెంచర్ యజమానిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సతీష్, రాము, సంజీవ్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజండానే
### -సిపిఎం అందోల్ ఏరియా ద్వితీయ మహాసభలో మాణిక్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్

**చౌటకూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజండాలనే అనిఇ సిసిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శివంపేటలో సిపిఎం అందోల్ ఏరియా ద్వితీయ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జండాను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఇటీవల అనారోగ్యంతో కానరాని లోకాలకు చేరిపోయిన పార్టీ అగ్రనేత కాంమ్రేడ్ సీతారం ఏచూరి బుద్దదేవ్ భట్టాచార్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, జి సాయిలులు మాట్లాడుతూ పాలక పార్టీలు ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేస్తూ గద్దె ఎక్కాక హామీలను మరచిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ఉద్యోగులు ప్రజలకు వ్యతిరేకంగా విధానాలను అవలంబిస్తూ అంబాని, అధాని లాంటి కార్పోరేటర్‌లకు ఊడిగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు బగ్గుమంటున్నాయని విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారరు. పేదల భూముల గుంజుకుని పెద్దలకు అప్పచెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అందోల్ ఏరియా కన్వీనర్ డి విద్యాసాగర్, మండల నాయకులు నాగభూషణం, సురేష్ రాములు, ప్రభాకర్, శ్రీశైలం, మహేష్, శ్రీను, కృష్ణ, అందోల్, వల్‌పల్లి, పుల్‌కల్, హత్నూర మండలాల శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## పాపన్నపేటలో ఆర్ఎస్ఎస్ పదసంచాలన్



**పాపన్నపేట, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ప్రపంచ దేశాలకు దిశా నిర్దేశం చేసే సత్తా కేవలం భారత దేశానికే ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ (ఆర్ఎస్ఎస్) మెదక్ విభాగ్ ప్రచారక్ ప్రముఖ్ బండి వెంకటేశ్వర్లు అన్నారు. విజయ దశమి, ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలను పురష్కరించుకుని పాపన్నపేట, టేక్మాల్ మండలాల ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మండల కేంద్రమైన పాపన్నపేటలో పద సంచాలన్‌ను భారీ ఎత్తున నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నెహ్రూ విగ్రహం వద్ద వక్త బండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశం కొరకు పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరు సేవా నిరతి కల్గి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తులను ఆదుకునేందుకు ఉత్సాహం చూపుతున్నది ఆర్ఎస్ఎస్ అని కొనియాడారు. కార్యక్రమంలో కండ కార్యవాహ దుర్గేష్, తోట రవీందర్, కృష్ణ, సుంకరి సాయిలు, ఆయా మండలాల ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమీ ఉత్సవాలు

**నర్సాపూర్ అక్టోబర్ 6. ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల హైదానంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధ్వర్యంలో విజయదశమీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సేవకుల పద సంచలన కార్యక్రమంలో బాగంగా నర్సాపూర్‌పట్టణ వీదుల గుండా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.అనంతరం కళాశాల మైదానంలో స్వయం సేవక్‌ల తో పద సంచలన మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీణా కుమారి. ముఖ్య వక్త మెదక్ విభాగ్ కార్యావాహ్ బోల నాగబూషణం లు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు హిందు సాంద్రాయం ప్రకారం విజయదశమీ పండగ విశిష్టత, హిందుమతం తదితర ఆంశాలను క్లుప్తంగా వివరించడం జరిగింది. ఈమేరకు ఆర్ఎస్ఎస్ అధ్వర్యంలో నిర్వహించిన విజయదశమీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమంలో జిల్లా కార్యావాహ వనముల ఓంకార్, సిద్దుల నాగరాజు, అల్వాల రమేశ్, నాయకులు వెంకటరమణ, రాజెందర్, బుచ్చేష్‌యాదవ్, పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## సర్వ మానవాళిపై అమ్మవారి కరుణాకటాక్షాలు
### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 06) :** సర్వ మానవాళిపై జగన్మాత ఆశీస్సులు ఉంటాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు అగ్గనూరు బస్వం, చెంది తిరుపతి రెడ్డి, కౌన్సిలర్ ప్రతాప్ రెడ్డి, టీఎన్జీవోస్ తాలుకా అధ్యక్షుడు మల్కయ్య గారి వెంకట్ రెడ్డి, పోలేపల్లి సందీప్, ప్రదీప్, గంగనమోని సత్తయ్య, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు నుంచి వెదజల్లుతున్న దుర్వాసన
### టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య



డంపింగ్ యార్డులో కుళ్లిన వ్యర్థాలను చూపిస్తున్న జంగయ్య

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 06) :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల నుంచి సేకరించిన చెత్తను 5వ వార్డు సోలీపూర్ గ్రామ శివారులో వేస్తున్నారని, ఆ వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఆసుపత్రులు, హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, చిన్న చిన్న కుటీర పరిశ్రమలు, నందిగామ, కొత్తూరు, బాలానగర్ మండ లాల్లో ఉన్న పరిశ్రమల నుంచి, ధాబాల నుంచి సేకరించిన చెత్తను రాత్రీపగలు తేడా లేకుండా ఇక్కడ పడవేయడం వల్లనే డంపింగ్ యార్డులో దుర్వాసన అధికమవుతుందన్నారు. వేసిన చెత్తను కదిలించడం వలన దుర్వాసన మరింత ఎక్కువవుతుందని, చెత్తను కదిలించేప్పుడు దుర్వాసన రాకుండా రసాయనాలను స్ప్రే చేయాలని అన్నారు. నవరాత్రుల సందర్భంగా గ్రామంలో ప్రజలు అమ్మవారికి పూజలు నిర్వహిస్తారని, అదేవిధంగా మహిళలు బతుకమ్మ ఆడుకుంటారని, డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను కదిలించకూడదని సింగపాగ జంగయ్య డిమాండ్ చేశారు.

## పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రేపు సన్మానం

**ధారూర్,అక్టోబరు 6, ప్రభాతవార్త** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు స్టార్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మెమోంటో శాలువాతో సన్మానిస్తున్నట్లు ధారూర్ మాజీ జెడ్పిటిసి సుజాత వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు ప్రజాప్రతినిదులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కుష్మాంగ మాతగా వనదుర్గా మాత
### -అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



కుష్మాండ మాతగా భక్తుల పూజలు అందుకుంటున్న వనదుర్గ మాత

**పాపన్నపేట, అక్టోబరు 6, ప్రభాతవార్త:** భక్తుల కోరికలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ సన్నిదిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి ప్రపత్తుల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన ఆదివారం చవితిని పురష్కరించుకుని ఆకుపచ్చ రంగు పట్టు వస్త్రాలతో కుష్మాండు మాతగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**-అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్...,**



అమ్మవారిని దర్శించుకుంటున్న సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లా అధనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్ కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యమ్రాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

**-నేడు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనం...**

దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదవ రోజైన సోమవారం పంచమిని పురష్కరించుకుని అమ్మవారిని పెసరు రంగు పట్టు వస్త్రాలతో మహాలక్ష్మి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, ఆలయ ఈఓ పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని భక్తులకు సూచించారు.

## విష్ణు ఫార్మసీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**నర్సాపూర్ అక్టోబర్ 6. ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపకులు, విధ్యార్థినులు సాంప్రదాయమయిన దుస్తులు ధరించి వివిద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారు వివిద రకాల ఆటల పోటీలను నిర్వహించి బతుకమ్మఆటలను ఆడుతూ బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో కళాశాల హెచ్‌ఓడి లు వనిత, తదితర అధ్యాపకులు ,విధ్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



# రోగాలు పెంచుతున్న జంక్‌ఫుడ్



**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త**

మంచి ఆకలి మీద ఉన్నారు. రెస్టారంట్‌లో మీరు ఆర్డర్ ఇచ్చిన పిజ్జా వేడివేడిగా నోరూరిస్తుంది. ఒక ముక్క నోట్లో పెట్టుకున్నారు. మరో ముక్క..ఇంకో ముక్క..పూర్తిగా తినేంతవరకూ కంట్రోల్ చేసుకోవడం మీవల్ల కాలేదు. ఐస్‌క్రీం, బిస్కట్లు తిన్నప్పుడూ ఇలాంటి ఫీలింగే ఉంటుంది. ఒకదానితో ఆపబుద్ధి కాదు.. జంక్‌ఫుడ్ తినడం ఆరోగ్యకరం కాదని తెలిసినా ప్రీ–ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ ఫుడ్ వైపు మొగ్గుచూపుతున్నారు. పెరుగుతున్న ప్యాకేజ్డ్ పాలు, కూల్‌డ్రింక్స్, కేక్‌లు, ఐస్‌క్రీంల వాడకం, విస్తృత మార్కెటింగ్, ప్రచారంతో వినియోగ దారులను ఆకర్షిస్తున్న సంస్థలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జంక్‌ఫుడ్ వినియోగం కట్టడి చేసేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ న్యూట్రిషనల్ లేబుల్స్ పాలసీ రూపకల్పన దిశగా చర్యలు చేపట్టింది. మరోవైపు ప్రాసెస్డ్ ఫుడ్ తయారీ సంస్థలు వినియోగదారుల దృష్టిని ఆకర్షించేందుకు ఉధృతంగా మార్కెటింగ్, వినూత్నప్రచారం చేపడుతుండటమే 'ప్రీ–ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ ఫుడ్' ప్రజలకు చేరువయ్యేందుకు కారణమవుతోందని చెబుతున్నారు. భారత ఆహారపదార్థాల మార్కెట్ ముఖ్యంగా ప్రీ–ప్యాకేజ్డ్ ప్రాసెస్ ఫుడ్స్ మార్కెట్ 68శాతం నుంచి 84 శాతానికి పెరిగినట్లు గతంలో నిర్వహించిన పలు అధ్యయనాలు వెల్లడించాయి. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌గా ముద్రపడిన వాటిలో అధికశాతం కొవ్వు, చక్కెర, ఉప్పు, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక కాలరీలుంటాయి. తరచూ ఈ తరహా ఆహారాలను తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు అధిక బరువు, ఊబకాయాలకు దారితీస్తున్నాయి. ఉదయాన్నే పాలు, బ్రెడ్, బిస్కెట్లు...సాయంత్రం కాసిన్ని చిప్స్, చిక్లెట్లు, కేకులు, పేస్ట్రీలు...రాత్రికి వేడివేడిగా ఇన్‌స్టంట్ నూడుల్స్, ఆపై కూల్ డ్రింక్స్ లేదా ఐస్‌క్రీమ్‌లు...ఏమిటి ఆహార చిట్టా అనుకుంటున్నారా? నేటి ఆధునిక జీవనశైలిలో ప్రజల ఆహార అలవాట్లలో వచ్చిన మార్పు కారణంగా పెల్లల నుంచి పట్టణాల వరకు, పిల్లల నుంచి పెద్దల వరకు దాదాపు ప్రతిరోజు చాలా మంది ఆహారంగా తీసుకుంటున్న ప్రీ–ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్స్ ఇవి. దీన్నే ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండేందుకు వీలుగా పారిశ్రామిక స్థాయిలో కొన్ని కృత్రిమ పదార్థాలతో శుద్ధి చేసి తయారు చేసిన ఆహార పదార్థాలన్నమాట. ఇలాంటి ఆహార పదార్థాలను తినడం వల్ల అధికబరువు, ఊబకాయం, బీపీ, షుగర్ వంటి జబ్బులబారిన పడతామని తెలిసినా ప్రజలు జిహ్వాచాపల్యంకొద్ది వాటి వాడకాన్ని మానలేకపోతున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు?ప్రాసెస్డ్ ఫుడ్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్రం ప్రీ–ప్యాకేజ్డ్ ప్రాసెస్డ్ ఫుడ్స్ క్రమబద్ధీకరణ, వాటి గ్రేడింగ్స్, ఉపయోగాల గురించిన విధాన రూపకల్పనకు కసరత్తు చేస్తోంది. ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్‌ఎస్‌ఏఐ) వివిధ సింబల్స్ ఆధారంగా ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ న్యూట్రిషనల్ లేబులింగ్‌ను అమలు చేయాలని యోచిస్తోంది. ఏ ప్రాసెస్డ్ ఆహారం ఎంతమేరకు ఆరోగ్యకరమో ప్యాకేట్లపై స్టార్‌రేటింగ్స్ ద్వారా తెలిసేలా కేంద్రం చర్యలు చేపట్టనుంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసర్చ్(ఐసీఎంఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ సంయుక్తంగా ప్యాకేజ్డ్ ఫుడ్స్ వాడకపై ఓ అధ్యయనం చేపట్టింది. 10 నుంచి 60 ఏళ్ళలోపు వారిని రెండు వర్గాలుగా విభజించి ఢిల్లీ, కోల్‌కతా, పూణే, హైదరాబాద్, జోర్హాత్‌లలో 3,231 మందిపై సర్వే నిర్వహించాయి. ఆహారం, సంస్థల విశ్వసనీయత, పోషకాల శాతం, స్టార్‌రేటింగ్స్, వార్నింగ్ లేబుల్స్ వంటి అంశాల గురించి పలు ప్రశ్నలు అడిగాయి. అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. అవి ఏమిటంటే, ఎక్స్‌పైరీ డేట్‌పై అధికంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజలు ఎక్కువగా ప్రాసెస్డ్ ఫుడ్ ప్యాకేట్లపై వాటి ఉత్పత్తి, ఎక్స్‌పైరీ తేదీల వివరాలనే పరిశీలిస్తున్నారు. క్యాలరీలు, కొవ్వు పదార్థాలు, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్, కార్బోహైడ్రేట్లు, చక్కెర, ప్రోటీన్లు, ఉప్పు, కొలెస్ట్రాల్ వంటివి చెక్ చేయడం తక్కువే. ఐఎస్ఐ, అగ్‌మార్క్, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ వంటి పరిశీలన అంతంతే. ప్యాకేజ్డ్ ఆహారపదార్థాల్లో వినియోగదారులు ఎక్కువగా పాలు 61.4శాతం(రోజువారీ) వాడుతున్నారు. బిస్కెట్స్ 11.6శాతం(రోజువారీ) బ్రెడ్ 7.2 శాతం(రోజువారీ), చిప్స్ 6.9శాతం(రోజువారీ), చాక్లెట్లు 5.1(రోజువారీ) తింటున్నారు. అలాగే ఇన్‌స్టంట్ నూడుల్స్ 50.6 శాతం (వారా నికి), కేక్‌లు 41.8శాతం(వారానికి), ఏరేటెడ్‌డ్రింక్స్ 38.5 శాతం(వారానికి), ఐస్‌క్రీమ్ 38.2శాతం(వారానికి) ఐస్‌క్రీమ్ 37.2శాతం (వారానికి), చాక్లెట్లు 36.4(వారానికి) లాగిస్తున్నారు. వినియోగ దారుల్లో బ్రాండ్ పేరును చూసి 65.2 శాతం మంది ఖరీదుచేస్తుండగా వెజ్, నాన్‌వెజ్ సింబల్స్ చూసే వారు 46శాతం, పరిమాణం చూసేవారు 31.8శాతం, ఆరోగ్యకారకాలు (హెల్త్ క్లయిమ్స్) చూసికొనేవారు 30.1శాతం మంది ఉంటున్నారు. మరోవైపు జంక్‌ఫుడ్ సేవించడం వల్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వయోజనుల్లో 39శాతం మంది అధిక బరువుతో, 13శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**కంటోన్మెంట్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో మంజూరైన 1,200 కళ్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కులను వీలైనంత త్వరలో లబ్ధిదారులకు అందించాలని కోరుతూ బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేశారు. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం మారడం వల్ల సాంకేతిక లోపాలతో 10 నెలలపాటు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వీలైనంత త్వరలో లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దేవులపల్లి శ్రీను, పనస సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ గౌర ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**బేగంపేట అక్టోబరు 6, ప్రభాతవార్త :** శ్రీనివాస్ గౌర ఫౌండేషన్ పేదలు సేవలు అందించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజక వర్గం ఇంచార్జి డా. కోట నీలిమ అన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్ పరిధిలోని ఎన్‌బిటినగర్ పాటిగడ్డలో శ్రీనివాస్ గౌర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆక్యుపంక్చర్ క్యాంపును కోట నీలిమ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఆరోగ్య సేవలను పొందలేని వారి కోసం శ్రీనివాస్ గౌర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడాన్ని ఆమె అభినందించారు. ప్రఖ్యాత ఆక్యుపంక్చర్ నిపుణుడు డాక్టర్ దీపక్ ఈ క్యాంపు ద్వారా 100 మంది రోగులను పరిశీలించి వైద్య సేవలు అందించారు. మరికొందరు రోగులను ఇతర చికిత్సలు అందించేందుకు సింధ్ కాలనీలోని క్లినిక్‌కు రావాలని సూచించారు.

గౌర శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు తనకు తోచిన విధంగా వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే ఎన్‌బిటి నగర్‌లో ఉచిత ఆక్యుపంక్చర్ క్యాంపు నిర్వహించామన్నారు. ఉచిత క్యాంపు లో విశాల్ సుధామ్, చిరంజీవి, దేవేందర్, సబా, తస్లీమ్, బబ్లూ, నవాజ్, సమద్, భీమ్, ఆలీమ్, కృష్ణ, మోహిత్, ఫిరోజ్ పాల్గొన్నారు.

# ఆరోగ్య రాజధానిగా హైదరాబాద్

* ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు కట్టడి చేద్దాం
* రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
* గచ్చిబౌలిలో ఉత్సాహంగా గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్



రన్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

**గచ్చిబౌలి, అక్టోబరు 6 ప్రభాతవార్త**

దేశంలో హైదరాబాద్ నగరం ఆరోగ్య రాజధానిగా వెలుగొందుతుందని, వివిధ దేశాలకు ఎగుమతి అయ్యే మందుల్లో 40 నుంచి 50 శాతం హైదరాబాద్ నగరంలోనే తయారవుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ మహమ్మారిని కట్టడి చేయవచ్చని తెలిపారు. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో ఆదివారం ఉదయం నిర్వహించిన క్యాంబియంట్ గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్–2024 కు మంత్రి కోమటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ 10కె,5కె,2కె రన్‌లను నిర్వహించారు. ఈ రన్‌ను ఆదివారం ఉదయం యుఎస్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, టిఎస్ఆర్‌టిసి ఎండి విసి.సజ్జనార్, గివ్ లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బార్ట్ ఎస్.ఫిషర్‌లు జెండాఊపి ప్రారంభించారు. అనంతరం ముగింపు కార్యక్రమానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు, పురుషుల విభాగాల్లో రన్‌లో మొదటిస్థానాల్లో నిలిచిన వారికి మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్యమే మహా సంపద అన్నారు. తాను ప్రతిరోజు 10 కిలోమీటర్లు పరుగెడుతానని అన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ పేదలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఆదుకుంటుందని అన్నారు. నగరంలో నిర్వహించిన రన్‌కు 20వేల మంది హాజరుకావడం సంతోషకరమని, ఇది దేశంలోనే అతిపెద్ద రన్‌గా నిలుస్తుందన్నారు. ప్రపంచంలోని 130దేశాల్లో భౌతిక, వర్చువల్ పద్ధతిలో రన్ నిర్వహించడం, మొత్తం 1లక్ష మంది పాల్గొంటుండడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ నగరం వ్యాక్సిన్ క్యాపిటల్‌తో పాటు హెల్త్ టూరిజం హబ్‌గా వెలుగొందుతుందన్నారు. క్యాన్సర్ మహమ్మారిపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు రన్ నిర్వహించడం అభినందనీయమని, క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ఎంతో కీలకమన్నారు. మొదటి, రెండవ దశల్లో రోగ నిర్ధారణ జరిగితే ప్రాణాలను కాపాడవచ్చని, వ్యాధి ముదిరిన తరువాత దశల్లో రక్షించడం కష్టతరంగా మారుతుందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలని, తెలంగాణ ముఖ్యమంత్రి స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కాగా రన్‌కు హైసియా, ఎస్‌సిఎస్‌సి, సిఐఐ, ఎల్ఐసి తదితర సంస్థలు మద్దతుగా నిలిచాయని, దాదాపు 20వేల మంది రన్‌లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌ను అమలు చేసేందుకు నిధుల సమీకరణ కోసం 'రన్ ఫర్ గ్రేస్ స్క్రీన్ ఫర్ లైఫ్' నినాదంతో రన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి, బ్లేడ్

# మేడ్చల్‌కు మెట్రోను విస్తరించకపోతే ఉద్యమిస్తాం

### ఎమ్మెల్యే వివేకానంద



గాంధీ విగ్రం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద, మెట్రో సాధన సమితి

**పేట్ బషీరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త**

మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో జీడిమెట్ల గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నగరానికి నలువైపులా మెట్రో విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు నిర్మాణంవంటి అభివృద్ధి పనులతో కెసిఆర్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. నగరానికి ఉత్తరం వైపున కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాలతో పాటు తూము కుంట, శామీర్‌పేట్ ప్రాంతాలకు మెట్రో విస్తరణపై సర్వే సంస్థలను ఎంపిక చేసి పనులను అప్పగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే పక్కన పెట్టి, ఫోర్త్ సిటీ పేరుతో తన ఊహల నగరంగా సృష్టించి లేని నగరానికి మెట్రో విస్తరణ పేరుతో 8వేల కోట్ల రూపాయలు ప్రతిపాదించడం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపార ఆలోచన తప్పా ప్రజలకు ఎటువంటి మేలు జరగదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం ఉండాలేతప్పా స్వార్థ రాజకీయాల కోసం కాదని అన్నారు. చెరువుల పరిరక్షణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా, మూసి సుందరీకరణ పేరుతో పేదల ఇల్లు కూల్చివేత, ఫోర్త్ సిటీ పేరుతో ఊహల నగరానికి నిధుల కేటాయింపు వంటి నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారన్నారు. ఈ నిర్ణయాల వెనుక ముఖ్యమంత్రి అనుభవ రాహిత్యం, అవగాహన లేమి స్పష్టంగా కనపడుతుందన్నారు. మేడ్చల్ మెట్రో పనులను విస్మరించడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, మాకు న్యాయబద్ధంగా రావాల్సిన మేడ్చల్ మెట్రోను సాధించి తీరుతామని అన్నారు. మేడ్చల్‌కు మెట్రోను విస్తరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మన జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:**

మన జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడలో సత్య నెక్లెస్ ఫ్రైడ్‌లో ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో అనేక కాలనీలలో, వివిధ కమ్యూనిటీల్లో, హౌసింగ్ కాంప్లెక్స్‌ల్లో ఇప్పటి వరకు దాదాపు 40 ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేయటం జరిగిందని తెలిపారు. నేటి మన మారుతున్న జీవన విధానంలో అనేక మానసిక వత్తిడులతో అశాంతికి లోనవుతూ వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంలో భాగంగానే ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# ఖాజాహిల్స్ గుట్టపై అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే



వివరాలు వెల్లడిస్తున్న వేదకుమార్ మణికొండ

**గచ్చిబౌలి, అక్టోబరు 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ డక్కన్ ఫార్మేషన్‌కు విశిష్టమైన గుర్తింపు ఉందని, ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద శిలలుగా డెక్కన్ శిలలకు పేరు వచ్చిందని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ మణికొండ అన్నారు. అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను పురస్కరించుకొని డెక్కన్ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఖాజాగూడలోని ఫక్రుద్దీన్ గుట్ట ఖాజాహిల్స్‌ను పరిశీలించారు. జియో హెరిటేజ్ ట్రైల్, సేవ్ రాక్ సొసైటీ, సేవ్ రెయిన్ వాటర్ సభ్యులు, జియోలాజికల్, అర్కియాలజీ శాఖలకు చెందిన రిటైర్డు ఉద్యోగులతో కలిసి ఖాజాహిల్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వేదకుమార్ మాట్లాడుతూ 2021వ సంవత్సరం నుంచి అక్టోబరు 6వ తేదీని ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ జియో డైవర్సిటీ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. వరల్డ్ జియో డైవర్సిటీ డే సందర్భంగా ఖాజాహిల్స్‌ను కలియతిరిగి ఇక్కడి విశేషాలను సేకరించినట్లు తెలిపారు. జియో డైవర్సిటీ డేను 80దేశాలు జరుపుకుంటున్నాయని అన్నారు. జియో డైవర్సిటీ డే సందర్భంగా 2022లో నౌబత్ పహడ్ గుట్టను, 2023లో మౌలాలీ పహడ్‌ను, ఈ సంవత్సరం ఖాజాహిల్స్‌ను సందర్శించినట్లు తెలిపారు. తెలంగాణలోని పాండవుల గుట్ట, మౌలాలీ పహడ్, ఆంధ్రప్రదేశ్‌లోని బోర్రా గుహలు వంటి ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించి యునెస్కోకు పంపాలని కోరినట్లు తెలిపారు. డక్కన్ శిలలను గుర్తించి వాటి పరిధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ చకిలం వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న అంబర్‌పేట్ దేవస్థానం సేవాసమితి సభ్యులు, ప్రతినిధులు

## దసరా సమ్మేళనానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం

**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రులలో భాగంగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని అంబర్‌పేట్ దేవస్థానం సేవాసమితి సభ్యులు, ప్రతినిధులు కలిసి దసరా సమ్మేళనానికి రావలసిందిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అంబర్‌పేట్ దేవస్థానం సేవాసమితి చైర్మన్ ఇతర సభ్యులు పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, కుచ్చలకంటి దుర్గాప్రసాద్ రెడ్డి, శంకర్‌గౌడ్, లింగంపల్లి రాజు, పంచాల గిరిధర్‌గౌడ్, బింది మల్లికార్జున్‌గౌడ్, దోమకొండ కిషోర్, కంచె చంద్రశేఖర్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భర్తపై దాడికి పాల్పడిన భార్య

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబరు 6, ప్రభాతవార్త :** భర్త స్నానం చేస్తుండగా వీపు రుద్దమని భార్యను గట్టిగా పిలవడంతో ఎందుకంత గట్టిగా అరుస్తున్నావంటూ దాడిచేసిన సంఘటన కెపిహెచ్‌బి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన నల్గొండకు చెందిన శివయ్య, భార్య రజితలు తమ ముగ్గురు పిల్లల చదువు కోసం నగరానికి వచ్చి కెపిహెచ్‌బి కాలనీ 3వ రోడ్‌లో నివాసం ఉంటున్నారు. శివయ్య స్థానికంగా ఓ కంపెనీలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో వీరి మధ్య పలు మార్లు గొడవలు జరిగి ఒకరిపై ఒకరు కేసులు కూడా పెట్టుకున్నారు. పెద్దవాళ్ల జోక్యంతో కలిసి ఉంటున్నారు. గురువారం శివయ్య స్నానం చేస్తూ వీపు రుద్దమని భార్యను గట్టిగా పిలిచాడు. పెద్దగా అరుస్తున్నావెందుకు అని భార్య రజిత ఇనుపరాడ్‌తో శివయ్య తలపై వెనుకనుండి కొట్టింది. దీంతో శివయ్య తలకు గాయం కావడంతో చికిత్స పొందుతున్నాడు. కాగా శుక్రవారం శివయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో మహిళ అరెస్ట్ (3వ పేజీలో)

## అశ్రునయనాల మధ్య గాయత్రి అంత్యక్రియలు..

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబరు 6, ప్రభాతవార్త :** రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ఆదివారం కైలాసవాసం స్మశాన వాటికలో నిర్వహించారు. నటుడు నటకిరీటి రాజంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి శుక్రవారం రాత్రి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.. కెపిహెచ్‌బి కాలనీ 7వ ఫేజ్‌లోని కైలాసవాసం స్మశానవాటికలో కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ముగిసాయి. గాయత్రి భర్త చితికి నిప్పు అంటించాడు. కూతురి చివరి చూపు చూసి రాజేంద్ర ప్రసాద్ భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టాడు.



గాయత్రి అంత్యక్రియలు

# అవినీతి "కొలతలు"

- తూనికలు,కొలతల శాఖలో అవినీతి అధికారులు
- ప్రజలను మోసం చేసే వ్యాపారులే వీరి టార్గెట్
- పెట్రోల్‌బంకులు, గోల్డ్‌షాప్‌లు, మాల్స్‌ల నుంచి లక్షల్లో వసూలు
- ఎంఆర్‌పి ట్యాంపరింగ్, లేబులింగ్, పరిమాణపు మోసాలే వీరి ఆదాయాలు
- ఏళ్లుగా ఒకేదగ్గర పాతుకుపోయిన పలువురు అసిస్టెంట్ కంట్రోలర్లు
- చూసీచూడనట్లుగా వ్యవహిస్తున్న ఉన్నతాధికారులు



**హైదరాబాద్, అక్టోబరు 5,ప్రభాతవార్త:**

దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా తూనికల కొలతల శాఖలో పనిచేస్తున్న కొందరు అవినీతి అధికారులు షాపులను పంచేసుకుంటున్నారు. ప్రైవేట్ సిబ్బందితో అక్రమ వసూళ్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. నగరంలో చాలా ప్రాంతాల్లో పెట్రోల్‌బంకులు, మాల్స్, గోల్డ్‌షాపులు, కిరాణా దుకాణాలు ఇలా అన్నింట్లోనూ లీగల్ మెట్రాలజీ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్యాకింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎమ్మార్పీ ధరలను ట్యాంపరింగ్ చేయడం, ప్యాకింగ్ పరిమాణాలు తగ్గిపోవటం, ఎమ్మార్పీలేకుండానే అధిక ధరలకు విక్రయించడం వంటివి విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దీన్ని అరికట్టాల్సిన తూనికలు కొలతలశాఖలోని కొందరు అధికారులు వాటిని క్యాష్ చేసుకుంటున్నరు. మీరు నిబంధనలు పాటించడం లేదంటూ కేసులుపెట్టకుండా వారివద్దనుంటే నెలనెల మామూళ్లు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా బరువు తూచేయంత్రాల తయారీ, మరమ్మతు, యంత్రాలు సరిచూసి అధికారుల ఆమోదంతో ధ్రువీకరించేందుకు తూనికలు, కొలతల శాఖ అనుమతులు ఇస్తుంది. అవి పొందిన లైసెన్స్‌దారులు ఆయా వ్యాపారులు త్రాసులను ఏటా మరమ్మత్తు చేసి తనిఖీ అధికారి నుంచి వ్యాపారికి సర్టిఫికేట్ ఇవ్వాలి. ఈక్రమంలో తనిఖీ అధికారి యంత్రాన్ని పరిశీలించి అంతా సక్రమంగా ఉంటే సీలు వేస్తారు. ఈప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారుల తనిఖీల సమయంలో బరువు తక్కువగా చూపి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తిస్తే వ్యాపారితోపాటు సదరు యంత్రం తనిఖీ చేసి లైసెన్స్‌దారుల, తయారీదారులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఇందుకు విరుద్ధంగా వ్యాపారులపై కేసులు నమోదు చేసి లైసెన్స్‌దారులను వదిలేస్తున్నారు. అలాగే ఎలక్ట్రానిక్ కాంటాలను అధికారులు తనిఖీ చేసిన తర్వాత సీలు వేసి ముద్ర వేయాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో వ్యాపారులు ఉపయోగిస్తున్న యంత్రాలకు సీలులేకపోవడం గమనార్హం. కొందరు వ్యాపారులైతే నేరుగా తయారీదారుల వద్దకు వెళ్ళి బరువు ఎక్కువ చూపేలా యంత్రాల సాఫ్ట్‌వేర్ మార్పుచేయాలని కోరడం గమనార్హం. ఆహారపదర్థాల సంచులపై తయారీదారుడి పేరు, గడువు, బ్యాచ్‌నవంబర్, టోల్‌ఫ్రీనెంబర్, తయారీదారుని చిరునామా ,గరిష్ట చిల్లధర ముంద్రించాలని నిబంధనలు చెబుతున్నా..ఆచరణలో అమలు కావడం లేదు.

### వసూళ్ల పర్వం ఇలా...

మరమ్మతులు, రెన్యూవల్ పేరుతో లైసెన్స్ దారులు జిల్లా స్థాయి అధికారులు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఎలక్ట్రానిక్ కాంటాలను సంవత్సరానికి ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. మ్యానువల్ కాంటాలను రెండు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. రెన్యూవల్ ఫీజు ఒక గ్రాము నుంచి 20 కేజీల వరకు పదిరూపాయలు మాత్రమే, 30కేజీలనుంచి 50కేజీల వరకు 40రూపాయాల ఫీజు ఉంటుంది. కానీ వీరు 2నుంచి 5వేలకవరకు వసూళ్లు చేస్తున్నారు. అలాగే పెట్రోల్ బంకు యజమానుల నుంచి జిల్లా స్థాయి అధికారులకు నెలనెల మామూళ్లు ముట్టుతున్నట్లు అరోపణలు ఉన్నాయి. పెట్రోల్ బంక్‌లో ఉన్న నాజిల్‌ను సంవత్సరానికి ఒకసారి రెన్యూవల్ చేయాలి. రెన్యూవల్ ఫీజు 1720 రూపాయలు ఉంటుంది. కానీ అధికారులు నాలుగింతలు అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే ఇన్‌స్పెక్షన్ పేరుతో ఒక బంకు నుంచి 10లీటర్ల పెట్రోల్, డీజిల్ గానీ తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వేబ్రిడ్జి కాంటాల రెన్యూవల్ చార్జీ 3000లు వరకు ఉంటుంది. కానీ అధికారులు 12,000లవరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో ప్రభుత్వానికి చెల్లించేది 3వేల రూపాయలు మాత్రమే మిగతాది నేరుగా వీరి జేబుల్లోకి వెళ్లిపోతుంది.

### వీధివ్యాపారులనూ వదలట్లేదు ..

నగరంలోని పలు ప్రాంతల్లో తూనికలు, కొలతల అధికారులతోపాటు లైసెన్స్‌దారులు వీధి వ్యాపారులను కూడా వదలటం లేదు. తోపుడు బండిపై కూరగాయలు, పండ్లు అమ్ముకునేవారి నుంచి సైతం రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరికి బిల్లు కాగితం లాంటివి ఏమీ ఇవ్వరు. ఇన్‌స్పెక్టర్లు ఒక్కసారి బయటకు వచ్చారంటే 40 వేలనుంచి లక్ష వరకు వసూళ్లు చేయకుండా ఇంటికి వెళ్లరని వినికిడి. ఏమీలేనిపక్షంలో ఆయా కిరాణషాపుల వద్దకు వెళ్ళి దాన్ని, దీన్ని చూసి దీనికి ఎంఆర్పీ రేట్ లేదు. దీనికి ఎక్స్పైరీ డేట్ అయిపోయింది. అంటూ ఏదో ఒకసాకుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.

### కార్యాలయంలో సార్లు ఉండరు...

నగరంలోని తూనికలు కొలతలశాఖ ప్రధాన కార్యాలయం ముషీరాబాద్ గాంధీనగర్‌లో ఉంది. అక్కడ హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కంట్రోల్, సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో రంగారెడ్డిజిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ కార్యాలయాలు ఉంటాయి. ఇక్కడికి ఫిర్యాదు చేద్దామని వెళ్తే ఏఒక్కరూ కనిపించదు. కార్యాలయం తాళం వేశో ..లేదా ఒక్క అంటేండర్ మాత్రమే కార్యాలయంలో దర్శనమిస్తుంటారు. ఎప్పుడు వెళ్ళినా ఇదే తంతు సార్ వాళ్లు ఎక్కడికి వెళ్ళారని అడిగితే ఏమో నాకు తెలియదు అంటారు. ఇలా అధికారులు రోజూ ఎక్కడికి వెళ్తునారు..ఏం చేస్తున్నారన్న సమాచారం కార్యాలయం సిబ్బదికి తెలియకుండా ఉంటుంది.